ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

ఆదివారం 25 ఆగస్టు 2024



'ఎసెన్షియా' ఫార్మా కంపెనీలో ఉత్పత్తి నిలుపుదల

అనకాపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల ఘోర ప్రమాదం చోటుచేసుకున్న 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీలో ఉత్పత్తులను నిలిపివేస్తూ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడు రోజుల కిందట ప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన నేపథ్యంలో ఇప్పటికే కంపెనీలో అన్ని విభాగాలు మూతపడ్డాయి. కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

అవినీతికి ఆర్‌డబ్ల్యూఎస్ అడ్డా!

ఇంజనీర్లే కాంట్రాక్టర్ల అవతారం

- బినామీలను అడ్డు పెట్టుకుని పనులు
- అధిక కమీషన్లు వస్తుండడంతో ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేసిన అధికారులు, ఉద్యోగులు
- బదిలీలను సైతం అనుకూలంగా మార్చుకుంటున్న వైనం



పాడేరులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు వ్యవహారాలకు అడ్రస్‌గా మారిన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్(గ్రామీణా నీటి సరఫరా విభాగం)ను ప్రక్షాళన చేయాలన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ప్రధానంగా వివిధ క్యాడర్లలోని ఉద్యోగులు ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేశారు. ఆఖరికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బదిలీల ప్రక్రియను సైతం తమకు అనుకూలంగా మలచుకుని ఇక్కడే మరో ఐదేళ్లు ఉండేలా బదిలీల్లో మతలబులు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లే బినామీ వ్యక్తులను కాంట్రాక్టర్లుగా చూపించి వాళ్లే ఆయా పనులు చేసి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో తొమ్మిదేళ్లుగా సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి తాజా బదిలీల్లో సైతం ఈఈ కార్యాలయం నుంచి డీఈఈ కార్యాలయానికి బదిలీపై వచ్చి, మళ్లీ ఈఈ కార్యాలయంలోనే పని చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సదరు ఉద్యోగి తొమ్మిదేళ్లుగా ఇక్కడే ఉంటూ పలువురు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను తమ గుప్పెట్లో పెట్టుకుని దండిగా సంపాదించారని, దీంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆయన ఇష్టపడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్ అధికారిణి, ఒక డీఈఈ, ఏజెన్సీలో నలుగురు ఏఈఈలు గత కొన్నాళ్లుగా ఇక్కడే ఉంటూ రెండు చేతులా సంపాదిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పదోన్నతిని సైతం వదులుకుని ఇక్కడే ఉంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు గతంలో ఇక్కడ డీఈఈగా పని చేసిన ఒక అధికారికి ఈఈగా పదోన్నతి లభించినా వెళ్లని వైనంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో 'సీటు వదలరు.. సారు కదలరు' శీర్షికన ప్రచురించిన కథనానికి అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు స్పందించడంతో ఎట్టకేలకు ఆ 'సారు' సీటు వదిలారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏటా రూ.150 కోట్లతో పనులు

గ్రామీణా నీటి సరఫరా విభాగంలో ప్రతి ఏడాది సుమారుగా రూ.150 కోట్లతో తాగునీటికి సంబంధించిన వివిధ పనులు జరుగుతాయి. పనులెలా జరిగినా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు వచ్చే లాభాల్లో మాత్రం ఎటువంటి తేడాలు ఉండవు. దీంతో ఏజెన్సీలోని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పని చేసేందుకు ఉద్యోగులు, ఇంజనీర్లు ఎగబడితే, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు తీవ్రంగా పైరవీలు చేస్తారు. అందుకే ఎక్కడా లేని విధంగా 25 శాతం మైనస్‌కు సైతం ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధపడతారు. ఒక పనికి కేటాయించిన నిధుల్లో 25 శాతం మైనస్ అయితే, మిగిలిన 75 శాతం నిధులతో పనులు జరిగితే, వాటి నాణ్యత ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. అందుకే ఇంజనీర్లు, ఉద్యోగులే బినామీ వ్యక్తులను కాంట్రాక్టర్లుగా పెట్టుకుని వాళ్లే ఆయా పనులు చేసి, నాలుగు రాళ్లు వెనకేసుకోవడం మామూలైపోయింది. ఈ క్రమంలో నాణ్యత లోపిస్తున్నది. ఇదే విషయాన్ని గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో అధిక సంఖ్యలో సభ్యులు ప్రస్తావించారు. అలాగే ప్రతి మండల సర్వసభ్య సమావేశంలోనూ ఆర్‌డబ్ల్యూఎస్

... మిగతా 8వ పేజీలో

ఏజెన్సీలో వాణిజ్య పంటలకు ప్రోత్సాహం అవసరం

- ప్రధాన రహదారులకు ఇరువైపులా పొదలను తొలగించాలి
- అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలి
- అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి నిర్మించాలి
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. దీనిపై జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్పందించి కాఫీ, మిరియాలు, సిల్వర్ ఓక్ చెట్ల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశమందిరంలో జరిగాయి. ఈ సమావేశాల్లో దేవరాపల్లి, చింతపల్లి, గొలుగొండ జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, పోతుల బాలయ్య, గిరిబాబు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రధాన రహదారులకు ఇరువైపులా పొదలు పెరగడంతో మలుపులున్న చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరగా, చైర్‌పర్సన్ సుభద్ర స్పందించి ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లు బాగుచేయాలని పద్మనాభం, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యులు సుంకరి గిరిబాబు, దొండా రాంబాబు కోరగా, రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయని అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ఫిర్యాదు చేశారు. బలహీన వర్గాలకు చెందిన గృహ నిర్మాణదారులకు ఈ ఏడాది మార్చి నుంచి బిల్లులు రాలేదని గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు ప్రస్తావించగా, హౌసింగ్ అధికారులు బదులిస్తూ త్వరలో బిల్లులు మంజూరవుతాయన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కొత్తగా ఇళ్ల కోసం పెట్టిన దరఖాస్తులను ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చిన మార్గదర్శకాల మేరకు ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్రాల వాటా కింద రూ.4 లక్షలు మంజూరుచేస్తామని సంబంధిత అధికారి తెలిపారు. పరవాడ మండలం తానాంలో కాల్వ నిర్మాణంలో అవకతవకలపై జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఈఈ త్రినాథరావును చైర్‌పర్సన్ ఆదేశించారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ సామాజిక పింఛన్ల కోత పేరిట సర్వేచేస్తున్నారని ఫిర్యాదుచేయగా, డీఆర్‌డీఏ అధికారులు వివరణ ఇస్తూ అనర్హులుంటే తొలగిస్తాం తప్ప అర్హులకు ఇబ్బంది లేదని పేర్కొన్నారు.

అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి నిర్మించాలి

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులకు సత్వర చికిత్స అందించడానికి అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి నిర్మించాలని, నిత్యం అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని సభ్యులు కోరారు. నాలుగు రోజుల క్రితం అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కర్మాగారంలో ప్రమాదం జరిగినప్పుడు బాధితులను తరలించేందుకు అంబులెన్స్‌లు లేకపోవడంతో బస్సుల్లో తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు మాట్లాడుతూ ఎసెన్షియా ప్రమాదంలో బాధితుల తరలింపునకు అంబులెన్స్ లేకపోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. అచ్యుతాపురంలో కేంద్రం మంజూరుచేసిన ఈఎస్‌ఐ ఆస్పత్రిని తక్షణమే నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ దశలో జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని పరవాడలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సమావేశాలల్లో పలుమార్లు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కర్మాగార యాజమాన్యాలతో మాట్లాడి అంబులెన్స్‌లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే కోటవురట్ల మండలం కైలాసపట్నం ఘటనలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన బాలలు, ఎసెన్షియా ఘటనలో బాధితులకు వైద్యులు అందించిన సేవలు ప్రశంసనీయమని ఆమె కితాబు ఇచ్చారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉపాధి హామీ పనుల కోసం నిర్వహించిన గ్రామ సభలకు జడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానించలేదని ఫిర్యాదు చేయగా, సమాచారం ఇవ్వాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. దీనికి అధికారులు బదులిస్తూ గ్రామ సభలో చేసిన తీర్మానాల మేరకు ప్రతిపాదించిన పనులకు ఆమోదం లభిస్తోందని, తరువాత మండల, జడ్పీ సమావేశాల

... మిగతా 8వ పేజీలో

తప్పని డోలీమోత

రహదారి సౌకర్యం లేక అవసలు



డోలీపై మహిళను మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి, ఆగస్టు 24: గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మండలంలోని కొత్తూరు పంచాయతీ బూసిపాడు గ్రామానికి చెందిన కేరంగి చిన్నమ్మి తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను డోలీపై దట్టమైన అటవీ ప్రాంతం గుండా కొత్తూరు పంచాయతీ వరకు మోసుకొచ్చారు. అక్కడ నుంచి ఆటోలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



సీలేరులో వర్షం

జోరు వాన

రహదారులు జలమయం

పాడేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడేరుతో సహా పలు మండలాల్లో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం సాధారణ వాతావరణం ఉన్నప్పటికీ పది గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షం నీటితో పట్టణంలోని రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. తాజా వర్షానికి జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

సీలేరులో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో శనివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో సీలేరు జెన్‌కో కాలనీలో కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. అల్లూరివీధి, దుర్గావీధిల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి రావడంతో జనం ఇబ్బందులు పడ్డారు. అలాగే ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో కూడా భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా రోజువారీ కూలీలకు ఉపాధి లేక ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం కారణంగా సప్పర్లలో వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రహదారులు చిత్తడిగా మారాయి.

వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. స్థానిక వారపు సంత వెలవెలబోయింది. వర్షం కారణంగా సంతకు ఆశించిన స్థాయిలో వినియోగదారులు రాలేదు.

వింత ఆకారంలో అడవి పుట్టగొడుగు

- వీటిని తినకూడదని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సూచన



వింత ఆకారంలో ఉన్న పుట్టగొడుగు

చింతపల్లి, ఆగస్టు 24: మండలంలోని గొందిపాకలు పంచాయతీ కేంద్రంలో ఓ గిరిజన రైతు కాఫీ తోటలో వింత ఆకారంలో అడవి పుట్టగొడుగు దర్శనమిచ్చింది. దీంతో స్థానిక గిరిజనులు ఆసక్తిగా తిలకించారు. గొందిపాకలు గ్రామానికి చెందిన రామారావు కాఫీ తోటలో పుట్టకు సమీపంలో సహజసిద్ధమైన అడవి పుటగొడుగు వచ్చింది. సాధారణంగా వర్షాకాలంలో పుట్టలు, వెదురు మొదళ్లు, మెట్ట భూముల్లో భూమి నుంచి పైకి ఎదిగిన పుట్టగొడుగులు కనిపిస్తుంటాయి. ఈ పుట్టగొడుగులను ఆదివాసీలు సేకరించి ఆహారంగా తీసుకుంటారు. అయితే రామారావు కాఫీ తోటల్లో మొలకెత్తిన ఈ పుట్టగొడుగు చుట్టూ నెట్ ఆకారంలో రక్షణ వలయాన్ని ఏర్పరచుకున్నది. ఈ విధంగా ఉన్న పుట్టగొడుగును ఎప్పుడూ చూడలేదని స్థానిక ఆదివాసీలు అంటున్నారు.

ఇవి తినకూడదు

అడవిలో లభించే సహజసిద్ధమైన పుట్టగొడుగులు ఆహారంగా తీసుకోవచ్చునని, వింత ఆకారంలో ఉన్న పుట్టగొడుగులను ఆహారంగా తీసుకోకూడదని హరిపురం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి. దివ్యసుధ తెలిపారు. ఈ పుట్టగొడుగులను ఆహారం తీసుకుంటే వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. ఏదైన పుట్టగొడుగును చేతితో విరిపినప్పుడు ఒకేసారి విరిగిపోతే తినడానికి అనుకూలమైనవిగా గుర్తించాలని, అలా కాకుండా సాగినట్టు ఉంటే తినకూడనవిగా గుర్తించాలని సూచించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

- విశాఖ పోర్టు స్టేడియంలో నేటి అర్ధరాత్రి నుంచి ఎంపికలు ప్రారంభం

· 7లో

స్టాఫ్‌నర్సు ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్టాఫ్‌నర్సు షేక్ భాను

పాడేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఓ స్టాఫ్‌నర్సు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పాడేరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఆరు నెలలుగా తమకు జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకే ఆత్మాహత్యాయత్నం చేసినట్టు ఆమె తెలిపింది. దీనికి సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... స్థానిక ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్న షేక్ మీరా భాను శుక్రవారం రాత్రి తన ఇంట్లోనే నొప్పులకు సంబంధించిన 40 మాత్రలను మింగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో ఆమెకు రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వాంతులు, విరేచనాలు కావడంతో చుట్టుపక్కల వాళ్ల సహాయంతో శనివారం ఉదయం స్థానిక ఆస్పత్రిలో చేరింది. వైద్యులు, సిబ్బంది ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

- ఆరు నెలలుగా జీతాలు అందకపోవడమే కారణం

తన భర్త కొవిడ్‌తో మృతి చెందారని, తన జీతంలోనే ఇద్దరు పిల్లలను పోషిస్తున్నానని, ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డానని స్టాఫ్‌నర్సు మీరా భాను తెలిపారు. జీతాలు అందక అవస్థలు పడుతున్నామని, ఈ క్రమంలో బతకడం కంటే చావడమే మేలనే భావనతోనే ఈ ఘటనకు పాల్పడ్డానన్నారు. ప్రభుత్వం తమకు జీతాలు అందించి ఆదుకోవాలని ఆమె కోరారని తోటి సిబ్బంది విలేకరులకు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట స్టాఫ్‌నర్సులు, సిబ్బంది ఆందోళన



పాడేరు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న స్టాఫ్‌నర్సులు

తమకు ఆరు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని స్టాఫ్‌నర్సులు, సిబ్బంది శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. తమ జీతాల సమస్యపై ఉన్నతాధికారులకు అనేకమార్లు విన్నవించినా, ఆందోళనలు చేపట్టినా కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే స్థానిక ఆస్పత్రిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మొత్తం 97 మంది వైద్య సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాల చెల్లింపులు జరగలేదని తెలిపారు. స్థానిక ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ విభాగానికి మార్పు జరిగిన క్రమంలోనే వారికి ఆరు నెలలుగా జీతాలు అందలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర తెలిపారు.

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్టు


భర్త, అత్త, మామ, ఆడపడుచుని అరెస్టు చేసిన పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 24 : వివాహిత ఆత్మహత్య కేసులో నలుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలోని నెయ్యలవీధిలో ఈ నెల 20న వివాహిత కర్రి భారతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. శనివారం మృతురాలు భర్త మణికంఠ, అత్తా మామలు అచ్చమ్మ, వెంకటేశ్, ఆడపడుచు వరలక్ష్మిలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్ఐ మాట్లాడుతూ వివాహిత భారతిని భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు మానసికంగా, శరీరికంగా హింసించారన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కుటుంబ సభ్యులు ప్రేరేపించారని దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ మేరకు నలుగుర్ని గృహ హింస, ఆత్మహత్యకు ప్రేరేపించిన నేరాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

'ఎసెన్షియా' ప్రమాద క్షతగాత్రులకు కేంద్ర మంత్రి పరామర్శ


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడి అనకాపల్లి పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పరామర్శించారు. ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ వారికి అందుతున్న వైద్యసేవలను వివరించారు. క్షతగాత్రులతో మంత్రి మాట్లాడుతూ ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎసెన్షియా దుర్ఘటనలో 17 మంది మృతిచెందడం బాధాకరమన్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులకు మంచి వైద్యం అందుతుందని, ఏ ఒక్కరికి ప్రాణహాని లేదన్నారు. రెండు రోజుల్లో చాలా మంది డిశ్చార్జి అవుతారన్నారు. ఈ సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన అభినందనీయమన్నారు. ప్రభుత్వాలు పరిహారం కూడా ప్రకటించడంతో పెద్ద ఉపశమనం కలిగిందని వివరించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, డీటీ వై శ్రీరామ్మూర్తి, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ, గొంతిన భక్తసాయిరాం, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా


ఇసుక డిపో వద్ద కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ముకేశ్‌కుమార్ మీనా

అగనంపూడి, ఆగస్టు 24 : ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు పారదర్శకంగా అమలు చేయాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. విశాఖ నగర పరిధిలోని అగనంపూడిలో గల ఇసుక డిపోను, పినమడక సచివాలయంలో ఏర్పాటుచేసిన ఇసుక బుకింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇసుక నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ ప్రక్రియ, ఇతర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్, బుకింగ్ ప్రక్రియ వేర్వేరుగా నిర్వహిస్తున్నారా?, లేదా?...అని ఆరా తీశారు. బుకింగ్ కేంద్రంలోని రశీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇసుకను ప్రజలకు సజావుగా అందించాలని సూచించారు. ఇసుక సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని ముకేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రస్తుతం డిపోలో ఉన్న ఇసుక నిల్వల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇసుక కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి...ఇక్కడి పరిస్థితులు, అధికారులు, సిబ్బంది సహకారం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ రాజు, తహసీల్దార్ శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

- విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- నేటి అర్ధరాత్రినుంచి ఎంపికలు ప్రారంభం


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల కోసం ఏర్పాటుచేసిన బాక్స్‌లు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న విశాఖలోని పోర్టు స్టేడియంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డైమండ్ జూబ్లీ స్టేడియంలో మెయిన్ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను గమనించారు. ట్రాక్ పునరుద్ధరణ బారికేడ్లు, లైట్లు, టెంట్లు, క్యూలైన్ల సునిశితంగా పరిశీలించారు. అధికారులు, ఇతర సిబ్బంది ఉండేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న వసతి కేంద్రాన్ని, ఎంపిక సమయంలో అభ్యర్థులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ర్యాలీ ప్రారంభం నాటికి పనుల్లో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ఎంపిక ప్రక్రియకు వచ్చే వారికి ముందస్తు సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, స్పోర్ట్స్, వైద్య తదితర విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ర్యాలీని విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. పలువురు ఆర్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

మందుబాబుల ఆకతాయి చేష్టలు

- గాయాల పాలవుతున్న రైతులు, కూలీలు
- మద్యం బాటిళ్లతో నిండుతున్న వ్యవసాయ బావులు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నియంత్రణ కరువు

ఖాళీ సీసాలు పగులగొట్టి పంట పొలాల్లో వేస్తుండడంతో ఇబ్బందులు


వ్యవసాయ బావిలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

మాడుగుల, ఆగస్టు 24: మందుబాబుల ఆకతాయిచేష్టలు శ్రుతిమించుతున్నాయి. ఇక్కడ, అక్కడా అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతూ ఖాళీ సీసాలను పడేస్తున్నారు. వీరు మద్యం తాగేందుకు పొలాలను కూడా తమకు అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. అక్కడితో ఆగకుండా సీసాలను పగులగొట్టి నడిచే దారుల్లో పడేయడం, పంట బావుల్లోకి విసిరేస్తుండడం చేస్తున్నారు. దీంతో పంట బావులు మద్యం సీసాలతో నిండిపోయింది. మద్యం సీసాలను పగులగొట్టి దారుల్లో పడేయడంతో గాజు పెంకులు గుచ్చుకొని గాయాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో సైతం మద్యం సీసాలను పడేస్తుండడంతో పొలం పనులు చేసే సమయంలో తమకు, పశువుల కాళ్లకు గాజు పెంకులు గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు. ఇటీవల ఖరీఫ్ పనులు చేపట్టే సమయంలో పలువురు రైతులు, రైతు కూలీలు, పశువుల కాళ్లకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు పనికి వెళ్లలేక అవస్థలు పడ్డామని పలువురు రైతు కూలీలు తెలిపారు. మద్యం రాయుళ్ల చేష్టలు ఇప్పుడు పెద్ద సమస్యగా మారిందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాలకు సమీపంలో వరినాట్లు వేసిన పొలాల్లో మందుబాబులు రాత్రి వేళల్లో మద్యం మత్తులో దిగి తొక్కి వేస్తుండడంతో పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు అంటున్నారు. ఇలాంటి ఆకతాయిపనుల వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిసార్లు తాము హెచ్చరిస్తున్నా ఎవరూ వినడం లేదని రైతులు అంటున్నారు. మద్యం తాగడంపై పరిమితి లేకపోవడం, ఆకతాయి పనులపై నియంత్రణ కొరవడడంతో మద్యం రాయుళ్లు రెచ్చిపోతున్నారని రైతులు, రైతు కూలీలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మద్యం రాయుళ్ల ఆగడాలపై కన్నేసి ఉంచాలని ముఖ్యంగా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.


ఆరు బయట తాగి పడేసిన మద్యం సీసాలు

ఆధునిక జైళ్లుగా ఎస్ఈజెడ్ కర్మాగారాలు

- కార్మికుల ప్రాణాలు పోయినా 'ఎసెన్షియా' యాజమాన్యానికి పట్టదా?
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఆగ్రహం
- 28న యాజమాన్యాల తీరుపై విజయవాడలో నిరసన : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 24: ప్రస్తుతం ఆధునిక జైళ్లుగా సెజ్‌లోని కర్మాగారాలు తయారయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. అనకాపల్లిలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో గల ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమన్నారు. దీనిపై స్పందించాల్సిన సంబంధిత యాజమాన్యం అడ్రస్ లేకుండా పోవడం దారుణమన్నారు. 17 మంది కార్మికులు మృతి చెందగా, 35 మంది వరకు గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నా కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇష్టానుసారంగా పరిశ్రమల నిర్వహణ సాగుతున్నప్పటికీ వాటిపై ప్రభుత్వానికి నియంత్రణ లేదన్నారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, కర్మాగారాల పరిసర ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే స్పెషల్ ఎకనామిక్ జోన్ చట్టాలను తొలగించాలని, ట్రేడ్ యూనియన్‌లతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ కర్మాగారాల్లో తరుచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా, సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తక్షణమే ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ జరగాలన్నారు. కర్మాగారాల యాజమాన్యాల తీరును నిరసిస్తూ ఈనెల 28న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు గణేష్‌పాండా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా నాయకులు రాజాన దొరబాబు, ఆర్.శంకరరావు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్


సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసిన సీవీవో రామకృష్ణ ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్


బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రామకృష్ణ

మహారాణిపేట, ఆగస్టు 24 : ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మాసిటీలోని 'సినర్జిన్' కంపెనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రమాదాలకు యాజమాన్యాలతో లాలూచీ పడిన అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఫార్మా కంపెనీలలో సరైన భద్రతా చర్యలు, కార్మికులకు శిక్షణ సౌకర్యాలు లేవని అందువల్లే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యాలు చేసిన హత్యలని వారిపై కేసు నమోదుచేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి లోపాలు ఉన్నట్టయితే లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలలో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వి.విమల ఎస్కే రహమాన్ పి.చంద్రశేఖర్, మన్మథరావు క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ భూముల పరిశీలన


రాజయ్యపేట తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, ఆగస్టు 24: మండలంలోని విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములను కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం పరిశీలించారు. హైవే నుంచి కారిడార్ ప్రాంతానికి సేకరించాల్సిన భూములు, రహదారి నిర్మాణ ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. కాగిత, పాటిమీద, మూలపర్ర గ్రామాల్లో భూములను పరిశీలించారు. కారిడార్ కోసం సేకరించిన భూముల సరిహద్దులను, ఇతర అంశాలను మ్యాప్‌ల ద్వారా ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేడ్కర్ వివరించారు. తీర ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఆర్అర్ ప్యాకేజీ, నిర్వాసిత రైతుల సమస్యలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించండి

- 'సింహాద్రి' సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాకు ఎంపీ సీఎం రమేష్ విజ్ఞప్తి


సీఎం రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీజీఎం

పరవాడ, ఆగస్టు 24 : మండల పరిధిలో గ్రామాల అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఎంపీ రమేష్ సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన సముద్రిక అతిథిగృహంలో సీజీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్టీ పీసీ ఫ్లైయాష్ లోడుతో లారీలు రాకపోకలు సాగించడం వల్ల పరవాడ-అనకపల్లి ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సంస్థ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. ఉపాధి కల్పనలో నిర్వాసిత యువతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, మాదంశెట్టి నీలబాబు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్‌లు సిరపురపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, వివిధ విభాగాల జీఎంలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల వినతి మేరకు బాలికకు టీసీ ఇవ్వలేదు

- కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ హిమాచల

చీడికాడ, ఆగస్టు 24: తల్లిదండ్రుల వినతి మేరకు బాలికకు టీసీ ఇవ్వలేదని మండలంలో కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ హిమాచల తెలిపారు. శనివారం ఆమె పాఠశాలలో విలేఖరులతో మాట్లాడుతూ ఇదే గురుకులంలో చదువుతున్న విద్యార్థిని ఇంటికి వెళ్లిపోవడానికి శుక్రవారం ప్రయత్నించిన విషయం విధితమే. దీనిపై బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు శుక్రవారం మధ్యాహ్నం రావడంతో వారితో మాట్లాడగా భవిష్యత్తులో ఇలా జరగకుండా చూసుకుంటామని వారు హామీ ఇవ్వడంతో రెండు రోజుల పాటు తమతో పాటు ఉంచి పంపుతామని కోరారన్నారు. బాలిక తల్లిదండ్రుల వినతి మేరకు అంగీకరించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. బాలికను బుధవారం పాఠశాలకు తీసుకువస్తామని తల్లిదండ్రులు చెప్పారన్నారు. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచుతామని, గుణాత్మక విద్యను అందించేందుకు ఎప్పుడూ కృషి చేస్తామని ప్రిన్సిపాల్ హిమాచల తెలిపారు.

యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే కర్మాగారాల్లో ప్రమాదాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం
- 'ఎసెన్షియా' ప్రమాదంలో గాయపడిన వారికి పరామర్శ


ఆస్పత్రిలో క్షతగాత్రులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తుమ్మపాల, ఆగస్టు 24: కర్మాగారాల్లో కేవలం యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో గాయాలపాలై అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం ఆయన పరామర్శించారు.

ప్రమాదం జరిగిన తీరు, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో 288, పరవాడలో 90, శ్రీకాకుళంజిల్లా పైడిభీమవరంలో 40 ఫార్మా కంపెనీలు ఉన్నాయన్నారు. వీటిలో తరుచూ ప్రమాదాలు జరుగుతూ కార్మికులు విగతజీవులు, క్షతగాత్రులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన తరువాత నాయకులు వస్తున్నారే తప్ప, యాజమాన్యాల ఆచూకీ ఎక్కడని ప్రశ్నించారు. లాభాలు తప్ప కార్మికుల జీవితాలు పట్టవా.. అని ప్రశ్నించారు. తక్షణమే ఎసెన్షియా పరిశ్రమ ఎండీ, పాలకవర్గంపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేవీవీ ప్రసాద్, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల, నాయకులు జి.గురుబాబు, ఆర్.అప్పలరాజు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, బి.అర్జున్, కాసుబాబు, వి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పనకు కృషి : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24 : స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎన్టీపీసీ, హిందూజా సంస్థల అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శనివారం హిందూజా సంస్థలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌ల నుంచి వచ్చే యాష్ పౌండ్, దుమ్ము, ధూళి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హిందూజా సంస్థకు రైల్వే లైన్ వేస్తే కాలుష్య సమస్యను చాలా వరకు నివారించవచ్చన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా కంపెనీల యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలను పాటించాలని సీఎం రమేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా కంపెనీల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష వద్దు

▸▸ జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్

పాడేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో హెచ్‌ఐ/ఎయిడ్స్‌పై అవగాహన ఏర్పరిచేందుకు అందరూ కృషి చేయాలని, సమాజంలో భాగమైన హెచ్‌ఐవీ బాధితులను ప్రేమగా చూసుకోవాలని కోరారు. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా అందరూ కృషి చేయాలన్నారు. హెచ్‌ఐవీ వల్ల కలిగే నష్టాలపై కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీపై నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్ బాషా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబ్బాయి, ఎస్ఎస్ఎస్ పీవో జి.గౌరిశంకరరావు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది రామచందర్, చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటాలైన్‌లో కృష్ణాష్టమి వేడుకలు రేపు

చింతపల్లి, ఆగస్టు 24: తాజంగి బీటాలైన్ రాధాకృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా మందిరంలో ప్రత్యేక పూజలు, వివిధ వేషధారణలో చిన్నారులు ప్రదర్శనలతో పాటు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

పిల్లర్లతో సరి..!

▸▸ అసంపూర్తిగా సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

▸▸ మూడేళ్లుగా పునాది స్థాయి దాటని నిర్మాణం

▸▸ 50 ఏళ్లుగా శిథిలమైన రేకుల షెడ్లలోనే తరగతుల నిర్వహణ

▸▸ పట్టించుకోని విద్యా శాఖ అధికారులు.. విద్యార్థుల అగచాట్లు

మేజర్ పంచాయతీ సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కా భవనం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. మూడేళ్లుగా పునాది స్థాయి దాటలేకపోతోంది. దీంతో అరకొర సదుపాయాల నడుమ శిథిలమైన రేకుల షెడ్లలోనే తరగతులు నిర్వహించాల్సి దుస్థితి ఏర్పడింది.



మూడేళ్లుగా పిల్లర్ల స్థాయి దాటని భవన నిర్మాణం

సీలేరు, ఆగస్టు 24: సీలేరు జల విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయిన తరువాత ఇక్కడ పనిచేసే ఉద్యోగులు, ఇంజనీర్ల పిల్లల కోసం 1970 లో పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఏపీఎస్ఈబీ (ప్రస్తుతం



సీలేరు జడ్పీహెచ్ పాఠశాల నిర్వహిస్తున్న ఈ షెడ్లలోనే...

జెన్‌కో) పాఠశాల కోసం రేకుల షెడ్లను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ రేకుల షెడ్లలోనే కొనసాగుతోంది. ఇవి నిర్మించి 50 సంవత్సరాలకు పైబడినవి కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో నూతన భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్ల సర్వశిక్షా అభియాన్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 'యూ' ఆకారంలో పక్కా భవనం నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

పాఠశాల భవన నిర్మాణాన్ని 2021 మార్చిలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. పిల్లర్లతో పాటు బేస్‌మెంట్, లెంటిల్ స్థాయి వరకు పనులను పూర్తిచేసిన కాంట్రాక్టర్, అక్కడితో ఆపేశారు. అయితే ఇంజనీర్లతో బిల్లు చేయించుకున్నప్పటికీ ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో బిల్లు చెల్లించలేదు. మూడు సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఈ భవనానికి మోక్షం లభించడం లేదు. కాగా, భవన నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టరు తీసుకొచ్చిన స్టీల్, ఇసుక, మెటల్ తదితర సామగ్రి చాలా వరకు దొంగల పాలైంది.

శిథిల రేకుల షెడ్లలోనే తరగతులు!

భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో శిథిల స్థితిలో ఉన్న రేకుల షెడ్లలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. దీంతో సుమారు 250 మంది విద్యార్థులు శిథిలమైన రేకుల షెడ్లలోనే ఇబ్బందులు పడుతూ విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో అన్ని చోట్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పక్కా భవనాలు ఉండగా, సీలేరులో మాత్రం రేకుల షెడ్లలో నిర్వహిస్తుండడం.. దాదాపు 50 సంవత్సరాలుగా ఇలాగే కొనసాగుతుండడంపై స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. అలాగే ఎప్పటికీ ఈ పాఠశాల రూపురేఖలు మారడం లేదని సీలేరుకు చెందిన ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మోక్షం కలిగేలా మంత్రి నారా లోకేష్ తగిన చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.

☛ సంక్షిప్తంగా..

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయండి: ఎస్పీ అమిత్‌బర్దార్

ముంచంగిపుట్టు, ఆగస్టు 24: గంజాయి రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ భద్రత వలయాలను ఆయన పరిశీలించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసు అధికారులు, స్థానిక పోలీసు సిబ్బందితో ఆయన మాట్లాడి మండలంలో తాజా పరిస్థితులు, మావోయిస్టుల కదలికలపై ఆరా తీసినట్టు సమాచారం. అలాగే గంజాయి నిర్మూలనకు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని పోలీసులకు సూచించినట్టు తెలిసింది. అలాగే గంజాయి వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేసి స్వచ్ఛందంగా మాదక ద్రవ్యాలకు దూరమయ్యేలా చెప్పినట్టు తెలిసింది. కాగా, ఎస్పీ పర్యటనకు సంబంధించి మీడియాకు పోలీసులు ఎటువంటి సమాచారం అందించలేదు.

ఆదివాసీ సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు చినబాబు, బుజ్జిబాబు

అరకులోయ, ఆగస్టు 24: ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అరకు ఏపీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఈ ఎన్నికలో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చినబాబు, గత్తుం బుచ్చిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల్లో సమస్యలపై దృష్టిసారిస్తామని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. దీర్ఘకాలిక సమస్యలపై అందరితో చర్చించి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, నాయకులు కె.నానిబాబు,బాబురావు, మొద్దు, వెంకట్‌జోషి, రామారావు పాల్గొన్నారు.

27న నేత్ర వైద్య శిబిరం

డుంబ్రిగుడ, ఆగస్టు 24: మండల కేంద్రంలో ఈ నెల 27న నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వైద్యాధికారి రాంబాబు తెలిపారు. విశాఖపట్నంలోని ఎల్‌వీ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు శిబిరంలో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతన్న గిరిజనులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి గిరిజనులు ఆధార్, రేషన్ కార్డుల నకళ్లతో రావాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

చింతపల్లి, ఆగస్టు 24: మండలంలో జన్‌మన్-2 కార్యక్రమంలో భాగంగా పీవీటీజీ గ్రామాలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్టు ఎంపీడీవో పి.ఆశాజ్యోతి చెప్పారు. శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ జన్‌మన్ పీవీటీజీ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన సదుపాయాలపై ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తెలిపారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 24: గిరిజన రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులకు పవర్ వీడర్లు, స్ప్రెయర్లు, వాటర్ పంప్ సెట్లు, వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు రాయితీపై పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు మండలంలోని సన్నా, చిన్నకారు రైతులు, రైతు సేవా కేంద్రాల్లో యంత్రాలు పొందేందుకు అర్హులన్నారు. వ్యవసాయ యంత్రాలు పొందేందుకు ఉద్యాన, వ్యవసాయ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అలాగే రెండు, మూడు రోజుల్లో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

బౌండరీ ట్రెంచ్‌లతో ఉపయోగాలు

జి.మాడుగుల, ఆగస్టు 24: బౌండరీ ట్రెంచ్‌లతో అనేక ఉపయోగాలు ఉంటాయని జి.మాడుగుల అటవీ రేంజ్ అధికారి ఆర్.అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని బీరం పంచాయతీ గడ్డిబంధలు గ్రామంలో అటవీశాఖ తోటల్లో ట్రెంచ్‌లు తవ్వకాలు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రెంచ్‌లు తవ్వకాలతో వేసవిలో అగ్ని నుంచి రక్షణ, భూసారాన్ని కాపాడటమే కాకుండా పశువుల భారీ నుంచి రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు తమ ఉద్యావన తోటల్లో కూడా ఉపాధి పథకం ద్వారా ఈ పనులు చేపట్టి లబ్ధి పొందవచ్చని చెప్పారు.

సెప్టెంబరు కోటాలో చక్కెర, గోధుమ పిండి

చింతపల్లి, ఆగస్టు 24: రేషన్ లబ్ధిదారులకు సెప్టెంబరు నుంచి బియ్యంతో పాటు చక్కెర, గోధుమ పిండి పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం ఎండీయూ ఆపరేటర్లతో రేషన్ సరకుల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెలాఖరు నుంచి ప్రతి రేషన్ డిపోకు బియ్యం, చక్కెర, గోధుమ గోదాముల నుంచి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఒకటో తేదీన రేషన్ సరకులు డిపోల నుంచి తీసుకొని లబ్ధిదారుల గృహాలకు అందజేయాలన్నారు. రేషన్ బియ్యం, చక్కెర, గోధుమ పిండి ప్రతి లబ్ధిదారుని అందజేయాలన్నారు. అంత్యోదయ కార్డుల కలిగిన లబ్ధిదారులకు కిలో చక్కెర పంపిణీ చేయాలన్నారు. రేషన్ సరుకులు పంపిణీలో జాప్యం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నెలలో తొలి వారంలోనే ప్రతీ కుటుంబానికి రేషన్ సరకులు అందజేయాలని సూచించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జి.మాడుగుల, ఆగస్టు 24: మండలంలోని బీవీకే పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోపికల వేషధారణలో చిన్నారులు వినూత్నంగా అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు సుస్తీ..!

▸▸ మూలకు చేరిన డౌనూరు పీహెచ్‌సీ వాహనం

▸▸ నర్సీపట్నం గ్యారేజీలో వదిలేసిన అధికారులు.. రోగులు అగచాట్లు

డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్స్‌కు సుస్తీ చేసింది. మరమ్మతులకు గురైన ఈ వాహనం మూలకు చేరింది. అప్పటి నుంచి నర్సీపట్నం గ్యారేజీలో మూలుగుతోంది. అధికారులు పట్టించుకోక పోవడంతో రోగులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.



డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే...

కొయ్యూరు, ఆగస్టు 24: డౌనూరు పీహెచ్‌సీకి మందులు తీసుకు వచ్చేందుకు అపిడమిక్ సీజన్ ఆరంభంలో పాడేరు సుమారు 50 రోజుల క్రితం వెళ్లిన అంబులెన్స్ మార్గమధ్యంలో మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి రోగులకు ఇది అందుబాటులో లేకుండా పోయింది. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే విశాఖపట్నంలోని గ్యారేజీకి పంపాలని ఆయన సూచించారు. అక్కడికి తీసుకువెళ్తే నెలలు తరబడి పని జరగదనే ఉద్దేశంతో స్థానికంగా ఉన్న నర్సీపట్నంలో మరమ్మతు చేయించేందుకు అనుమతులు తీసుకున్నారు. దీనిపై వర్క్ ఆర్డరు తీసుకుని అక్కడికి పంపించారు. ఇది జరిగి నెల రోజులు గడిచినా ఐటీడీఏ పీవో కార్యాలయం నుంచి అనుమతులు రాక నర్సీపట్నంలోనే మెకానిక్ షెడ్డు వద్ద అంబులెన్స్ మూలుగుతోంది. దీంతో సుమారు రెండు దశాబ్దాల పాటు ఇక్కడ రోగులకు సేవలు అందించిన అంబులెన్స్ అందుబాటులో లేక రోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో అత్యవసర సమయాలలో లంబసింగి అంబులెన్స్ లేదా 108 లేదా ఫీడర్ అంబులెన్స్‌తో కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని పీహెచ్‌సీ పరిధిలోని రోగులు కోరుతున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యధికారిణి లలితను వివరణ కోరగా, అంబులెన్స్ మరమ్మతుల కోసం వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఉన్నతాధికారులకు అడిగామన్నారు. ఈ వారంలో అంబులెన్సు మరమ్మతులు చేయించి సేవలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

హైవేపై స్తంభించిన ట్రాఫిక్

▸▸ రెండు రోజులుగా వాహన రాకపోకలకు ఇబ్బందులు



రహదారికి అడ్డంగా నిలిచిన లారీ, వాహనాలు

డుంబ్రిగుడ, ఆగస్టు 24: మండలంలోని కించుమండ సంతబయలు హైవేపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. జిల్లాలో పాడేరు-అరకు ప్రధాన రోడ్డు కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి మధ్యలో ఓ లారీ నిలిచిపోవడంతో వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం తెల్లరుజామున లారీ మరమ్మతుకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. రెండు రోజులుగా ఇలాగే ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గంజాయి నిర్మూలనకు శత విధాలా కృషి

▸▸ అరకులోయ సీఐ ఎల్.హిమగిరి



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ హిమగిరి, పక్కన ఎస్ఐ కరక రాము

అనంతగిరి, ఆగస్టు 24: గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు శతవిధాలా కృషి చేస్తామని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి తెలిపారు.అన్నారు. మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. పర్యాటక ప్రాంతాలు కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సాగు, రవాణా నివారణతో గిరిజనులు జీవితాలను నాశనం చేసుకోవడంపై గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గిరిజనులు ప్రత్యామ్నాయ పంటలు పండించుకుని ఆర్థికంగా ఎదిగేలా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కరక రాము, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చండి

▸▸ ఐటీడీఏ పీవో అభిషేక్



టెన్త్ విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న పీవో... పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న పీవో

కొయ్యూరు, ఆగస్టు 24: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలో రావణాపల్లి, కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలను, కంఠారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. కొమ్మిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం, తెలుగు పాఠ్యాంశాలను బోధించారు. సాంఘిక శాస్త్రంలో విద్యార్థులు వెనుకబడి ఉండడాన్ని గుర్తించి ఉపాధ్యాయురాలు ఎస్.సింహాచలానికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌ను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు పాఠ్యాంశాలను బోధించారు. వారి సామర్థ్యాలను పరీక్షించారు. అక్కడ విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రాత్రి సమయాలలో విద్యార్థులు ఏదేని తగినంత వెలుగు ఉండేలా విద్యుదీపాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

కంఠారం పీహెచ్‌సీని సందర్శించి అచ్చట రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలను పరిశీలించారు. మలేరియా కేసుల నమోదుపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలు జరిగితే ఉపేక్షించబోమన్నారు. అనంతరం శరభన్నపాలెంకు చెందిన దివ్యాంగుడు వనగల వెంకటరమణకు ఐటీడీఏ నిధులతో సమకూర్చిన ఎలక్ట్రానిక్ వాహనాన్ని పీవో అందచేశారు. పీవో వెంట ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు పాల్గొన్నారు.

ఆటో, లారీ ఢీకొని నలుగురికి గాయాలు



కారు ఢీకొనడంతో బోల్తాపడ్డ ఆటో

పాడేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న ఆటోను ఘాట్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో నలుగురు గాయపడ్డారు. పాడేరుకు చెందిన కె.రంభ, కె.మైనా, కె.నందిని, కె.పద్మ ఆటోలో శనివారం మైదాన ప్రాంతానికి ప్రయాణమయ్యారు. ఘాట్‌లోని ఏసుప్రభు మలుపునకు సమీపంలోకి చేరుకున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అకస్మాత్తుగా ఆటోను ఢీకొట్టింది. దీంతో రోడ్డునైనే బోల్తా పడడంతో ఆటో వున్న నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఘటన నుంచి తేరుకున్న నలుగురు స్థానిక ఆస్పత్రికి చేరుకుని చికిత్సలు చేయించుకున్నారు. అయితే తమ ఆటోను ఢీకొట్టిన కారు యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తమకు కనీసం చికిత్స చేయించకుండా మిన్నకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

విశాలాక్షినగర్, ఆగస్టు 24: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు కానిస్టేబుల్ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏఆర్ టైలరింగ్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ లక్ష్మయ్య (57) క్వార్టర్స్ నుంచి రోడ్డు మీదకు బైక్‌పై వస్తుండగా ప్రధాన రహదారిలో బైక్‌పై ఎదురుగా వస్తున్న యువకుడు ఢీకొన్నాడు. దీంతో లక్ష్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు ఆయన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతని స్వగ్రామం అల్లూరి జిల్లా హుకుంపేట మండలం శోభకోట గ్రామం. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మయ్య మృతి పట్ల ఏఆర్ విభాగం అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

సీలేరులో బైక్ చోరీ



దొంగలు అపహరించిన బైక్ ఇదే.. (ఫైల్)

సీలేరు, ఆగస్టు 24: మేజర్ పంచాయతీ సీలేరులోని అల్లూరి వీధిలో శుక్రవారం రాత్రి దొంగలు పల్సర్ బైకును అపహరించుకుపోయారు. అల్లూరి వీధిలో కార్పెంటర్ పని చేసే దమ్ము మారేష్ పది రోజుల క్రితమే కొత్త బైకును కొనుగోలు చేశాడు. ఇంకా ఆ బైకుకు నంబర్ కూడా రాలేదు. రోజు మాదిరిగానే బైకును శుక్రవారం రాత్రి ఇంటి ముందే హేండ్ లాక్ వేసి పార్కింగ్ చేశాడు. శనివారం ఉదయం చూసేసరికి బైకు కనిపించడలేదు. దీంతో బాధితుడు మారేష్ తన బైకును ఎవరో దొంగలు అపహరించి ఉంటారని, బైకు కోసం గ్రామంలో ఒడిశా సరిహద్దుల్లో పరసర గ్రామాలను గాలించినా ఎక్కడా లభ్యం కాలేదని బాధితుడు తెలిపాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు మారేష్ తెలిపాడు. సీలేరులో ఇటీవల బైకులు దొంగతనాలకు గురవుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు బైకులు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటి కొళాయికి ప్రత్యేక సర్వే

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జీఆర్‌హెచ్ రాజు



చింతపల్లి, ఆగస్టు 24: ఇంటింటి కొళాయి కోసం ప్రత్యేక సర్వే చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జీఆర్‌హెచ్.రాజు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ కొలాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. ఇందులో భాగంగా గ్రామంలో అందుబాటులో ఉన్న మంచినీటి పథకాల పనితీరు, ప్రతీ కుటుంబానికి కొళాయి ఉందా? ఎన్ని కుటుంబాలకు నీరు అందిస్తున్నది? మంచినీటి పథకం ఎప్పుడు నిర్మించారు? తదితర అంశాలపై సర్వే చేస్తున్నామన్నారు. ఈ సర్వే నివేదిక ఆధారంగా ప్రతీ కుటుంబానికి మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో 681 మంచి నీటి పథకాలు ఉన్నాయన్నారు. చింతపల్లి మండలంలో 185 పథకాల నిర్మాణాలు పూర్తి చేశామని మరో 298 పథకాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అలాగే జీకే వీధిలో 236 పథకాల నిర్మాణాలు పూర్తి చేయగా, మరో 84 పథకాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈపథకాలు అందుబాటులోకి వస్తే ఆదివాసీ గ్రామాలకు మంచినీటి సమస్య తీరుతుందని ఆయన చెప్పారు.

బల్లుగూడలో రోడ్లు, కాలువలు నిర్మించరూ..

ముంచంగిపుట్టు, ఆగస్టు 25: బాబుసాల పంచాయతీ బల్లుగూడ గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. వీధులను కలుపుతూ సీసీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డ్రైనేజీ సదుపాయం లేక చినుకుపడితే వీధులన్నీ మురుగునీటితో నిండిపోతున్నాయని వాపోయారు. ఫలితంగా ఇంటి నుంచి బయట కాలు పెట్టలేని దుస్థితి దాపురిస్తున్నదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు నిల్వ ఉండి పోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. వీధుల్లో రాళ్లను వేసుకొని రాకపోకలు సాగిస్తున్నామని, అధికారులు తక్షణమే స్పందించాలని విన్నవించారు.

ఏజెన్సీలో వాణిజ్య పంటలకు ప్రోత్సాహం అవసరం

... 5వ పేజీ తరువాయి

ఆమోదం అవసరమన్నారు. గ్రామ సభలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తామన్నారు. ఈ దశలో చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామ సభల్లో పనులు ప్రతిపాదించాలని సూచించగా, అధికారులు స్పందిస్తూ ప్రస్తుత ఏడాది, తరువాత నాలుగేళ్లకు సరిపడా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు.

కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలు

కేజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చైర్‌పర్సన్ సుభద్రతో పాటు సభ్యులు ప్రశంసించారు. అయితే వైద్యం కోసం వచ్చే వారికి పూర్తి వివరాలు చెప్పాలని కోరారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద బదులిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తాను అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇంకా మరింత సేవల కోసం కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలను నియమించామని, వారికి సంబంధించి ఫోన్ నంబర్లు 7569898151, 9030243861 లో సంప్రతించాలని కోరారు. కేజీహెచ్‌లో వైద్యం కోసం ఎవరైనా డబ్బులు అడిగితే కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891- 2590100, 0891-2590102కు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో 3, 5, 6 స్టాండింగ్ సమావేశాలు నిర్వహించారు.

అవినీతికి ఆర్‌డబ్ల్యూఎస్ అడ్డా!

... 5వ పేజీ తరువాయి

పనులపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. కానీ ఎవరూ వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఇదే అదనుగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో తిష్ట వేసేందుకు ఎన్ని ప్రయత్నాలైనా చేయడానికి ఉద్యోగులు, ఇంజనీర్లు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఆర్‌డబ్ల్యూఎస్‌లో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై దృష్టి సారించి ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.